


3న రెడ్డి శ్రీరామ్మూర్తి వర్ధంతి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

కలెక్టరేట్: సిపిఎం జిల్లా కార్యదర్శిగా పనిచేసి కరోనాతో మృతి చెందిన రెడ్డి శ్రీరామ్మూర్తి ద్వితీయ వర్ధంతి మే 3న బెలగాం సెంటర్లో గల గిరిజన సామాజిక భవనంలో జరుగుతుందని ఈ సభను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో వర్ధంతి సభ కరపత్రం, పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి శ్రీదేవి, బంటు దాసు, గొర్లి వెంకటరమణ, వి.ఇందిర, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

జంఝావతిని పట్టించుకోని ప్రభుత్వం



జంఝావతి రబ్బరు డ్యాం

- మొక్కుబడిగా భువనేశ్వర్ వెళ్లి వచ్చిన సిఎం
- పొరుగు జిల్లా పర్యటనలోనైనా స్పందించేనా?
- నాలుగు దశాబ్ధాలుగా తీరని సాగునీటి వసతి వెతలు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జంఝావతి సాగునీటి ప్రాజెక్టుపై కాంగ్రెస్, టిడిపిలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించగా, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి కూడా పట్టించుకోలేదు. దీంతో, సుమారు నాలుగున్నర దశాబ్ధాలుగా ఈ ప్రాంతవాసులకు సాగునీటి వెతలు తప్పడం లేదు. టిడిపి పాలనలో 2016లో ఓసారి ప్రభుత్వం తరపున అప్పటి కేంద్ర మంత్రి హోదాలో జిల్లాకు చెందిన పూసపాటి అశోక్ గజపతిరాజు ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరపగా, రెండున్నరేళ్ల క్రితం సిఎం జగన్మోహన్‌రెడ్డి కూడా అక్కడి సిఎంను కలిసి మమ అనిపించారు. ఆ తరువాత పట్టించుకోపోవడంతో లక్ష్యం నెరవేరలేదు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లాలో కొమరాడ, పార్వతీపురం, సీతానగరం, మక్కువ, గరుగుబిల్లి మండలాల్లో సుమారు 24వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు మన్యం జిల్లా కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం వద్ద నాగావళి నదికి ఉపనదిగా పేరొందిన జంఝావతిపై జలాశయాన్ని రూ.13.50కోట్ల అంచనా వ్యయంతో 1976లో తలపెట్టారు. అప్పటి రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు ఇందుకు చొరవ చూపించారు. ఈ జలాశయం పూర్తికావాలంటే ఒడిశా రాష్ట్రంలో 1175 ఎకరాలు ముంపునకు గురౌతాయి. ఆ పరిధిలోవున్న 250 కుటుంబాల వారు నిర్వాసితులుగా మారుతారు. అప్పట్లో చాలా వరకు పరిహారం చెల్లించడంతో చాలా గ్రామాలు ఖాళీచేసి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాయి. ఒకే ఒక్క గ్రామంలోని ప్రజానీకం ఖాళీ చేసేందుకు నిరాకరించడం, ఈ నెపంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణానికి అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో, తాత్కాలికంగా కొమరాడ, పార్వతీపురం, సీతానగరం మండలాల్లో 12వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రబ్బరు డ్యాం నిర్మించారు. ఇందులోనూ 6వేల ఎకరాలు నేరుగా రబ్బరు డ్యాం (లోలెవెల్ కెనాల్) ద్వారాను, మరో 6వేల ఎకరాలు ఎత్తిపోతల పథకం (ఎడమ కాలువ, హైలెవెల్ కెనాల్) ద్వారా సాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అనంతరం తగినన్ని నిధులు మంజూరు చేయకపోవడం, మోటార్లు పనిచేయక పోవడం, విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం వంటి కారణాల వల్ల హైలెవెల్ కెనాల్ ద్వారా చుక్కనీరు అందే పరిస్థితి లేదు. లోలెవెల్ కెనాల్ పూర్తిగా నిర్మించకపోవడం, నిర్మించిన కాలువనూ ఆధునీకరించకపోవడం వల్ల కేవలం కొమరాడ మండలంలో 2,500 ఎకరాలకు మించి సాగునీరు అందడం లేదు. ఈ నేపథ్యంలో ఒడిశాతో నెలకొన్న చిన్నపాటి వివాదాన్ని పరిష్కరిస్తే మూడు మండలాలు సస్యశ్యామలమౌతాయని, ఇప్పటికైనా స్పందించి వివాదాన్ని పరిష్కరించాలని చాలా కాలంగా జిల్లా వాసులు కోరుతున్నారు. ఎన్నోసార్లు వినతులు, నిరసన కార్యక్రమాలు సైతం రైతుసంఘం, రైతాంగం చేపట్టింది. ఎట్టకేలకు గత రాష్ట్ర ప్రభుత్వం తరపున 2016లో మన జిల్లాకు చెందిన అప్పటి కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు నాయకత్వంలో శ్రీకాకుళం ఎంపి కె.రామ్మోహన్‌నాయుడు, అప్పటి పార్వతీపురం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, ఇంజినీరింగ్ అధికారులతో కూడిన కేంద్ర బృందం ఒడిశా సిఎం నవీన్ పట్నాయిక్‌ను కలిసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. అనంతరం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా రెండున్నరేళ్ల క్రితం భువనేశ్వర్ వెళ్లి చర్చలు జరిపినప్పటికీ నేటికీ అతీగతీ లేదు. ఈ నేపథ్యంలో ఆరు రాష్ట్రాల మధ్యవున్న చిన్నపాటి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. ఫలితంగా పార్వతీపురం మన్యం జిల్లాకు సాగునీటి వెతలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో పొరుగు జిల్లా, నాటి ఉమ్మడి జిల్లాలోని భోగాపురం వస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి స్పందిస్తారని మన్యం జిల్లా వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రాజన్నా మా భవిష్యత్తు ఏమిటి?

- గందరగోళంలో కొటియా గిరిజనం
- భరోసా ఇవ్వలేని స్థితిలో ఆంధ్రా
- అదే అదునుగా దూకుడు పెంచుతున్న ఒడిశా



ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర మంతటా జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం అనే కార్యక్రమాన్ని వైసిపి ఎమ్మెల్యేలు మంత్రులు నిర్వహిస్తున్నారు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అధికార పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారు. అయితే వివాదాస్పద కొటియా గ్రామాల ప్రజలు మాత్రం మా భవిష్యత్తు ఏమిటి రాజన్నా అని ప్రశ్నించే స్థితిలో ఉన్నారు. ఆంధ్రాలో ఉంటామని నమ్మకంతో చెపుతున్నా ఎందుకు భరోసా ఇవ్వలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొటియా గ్రామాల విషయంలో ఎపి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. తాము ఆంధ్రాలో ఉంటామని మెజారిటీ కొటియా గ్రామాల గిరిజనులు స్పష్టం చేసినా వారికి అభయహస్తం ఇచ్చే పరిస్థితిలో ఇక్కడి ప్రభుత్వం లేకపోవడం అనుమానాస్పదంగా ఉంది. కొటియా వివాదాన్ని గత రెండేళ్లుగా రచ్చ చేయడంలో కొరాపుట్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు. రెండేళ్ల క్రితం వరకు కొటియా గ్రామాలపై ఒడిశా, ఆంధ్రా ప్రభుత్వాల పెత్తనం ఉండేది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొటియా గ్రామాల గిరిజనులకు అందుతుండేవి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు స్టేటస్ కో ఉత్తర్వులకు లోబడి పని చేశాయి. అయితే ఉన్నపళంగా ఒడిశా వైఖరిలో మార్పు రావడానికి బలమైన కారణాలే ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. అపారమైన ఖనిజ సంపద ఉన్న కొటియా గ్రామాలపై కన్నేసిన బిజెపి, బిజెడి ప్రజాప్రతినిధులు, నాయకులు కొటియా గ్రామాలపై పట్టు నిరూపించుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. కొటియా గ్రామాలపై పూర్తి ఆధిపత్యం సాధించే దిశగా వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం వరకు కొటియా గ్రామాల ప్రజలు రెండు రాష్ట్రాల ఎన్నికల లోనూ ఓటుహక్కు వినియోగించుకునే వారు. అయితే రెండేళ్ల క్రితం జరిగిన ఎపి స్థానిక సంస్థల ఎన్నికల్లో కొటియా గ్రామాల ఓటర్లను పాల్గొనకుండా కొరాపుట్ జిల్లా ప్రజాప్రతినిధులు అధికారులు ఎత్తుగడ వేశారు. ఈ ఎత్తుగడ బెడిసికొట్టింది. స్థానిక ఎన్నికల్లో కొటియా గ్రామాల ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంతవరకు ఒడిశా అధికారులతో ఆంధ్రా అధికారులు ఢీ అంటే ఢీ అనే పరిస్థితి వుండేది. ఆ తర్వాత ఒడిశా, ఎపి రాష్ట్రాల సిఎం ల మధ్య భువనేశ్వర్‌లో జరిపిన చర్చల్లో కొటియా గ్రామాల వివాదం చర్చకు వచ్చిందో లేదో గాని ఆ తర్వాత ఎపి ప్రభుత్వ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపించింది. అంతవరకు ఢీ అంటే ఢీ అనే రీతిలో వ్యవహరించిన ఆంధ్రా అధికారులు, పోలీసులు మౌనం వహిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో సత్సంబంధాలు ఉన్న సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన సంకేతాల మేరకే జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు కిమ్మనకుండా మౌనం వహించారు. కేంద్రంలో కీలకపాత్ర పోషిస్తున్న ఒడిశా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తే బిజెపి పెద్దలతో ఎపి ప్రభుత్వ పెద్దలు లోపాయికారీ అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే ఎపి అధికారులు ప్రజాప్రతినిధులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారనేది స్పష్టమవుతోంది.

పోలీసు అవుట్ పోస్ట్ ప్రతిపాదన అటకెక్కినట్టేనా?

వివాదాస్పద గ్రామాల వ్యవహారంలో దూకుడుగా వ్యవహరిస్తున్న ఒడిశా ప్రభుత్వం కొటియాలో పోలీసు స్టేషన్‌ను నిర్మించింది. అక్కడ ప్రత్యేక పోలీసు బలగాలతో క్యాంపు నిర్వహిస్తోంది. కొటియా గ్రామాల్లో ఆంధ్రాకు చెందిన అధికారులు గానీ, ఉద్యోగులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పర్యటిస్తే అడ్డుకునేందుకు వీలుగా ప్రత్యేక పోలీసు బలగాలతో క్యాంపు నడుపుతోంది. పట్టుచెన్నూరు, పగుల చెన్నూరు, ఎగువ శెంబి, దిగువ ఎంబి, గంజాయి భద్ర గ్రామాల్లో ఆంధ్రా అధికారుల చప్పుడు వినిపిస్తే వెంటనే కొటియాలో మొహరించి వున్న పోలీసులు వాలిపోతున్నారు. ఇటీవల కొద్దిరోజుల క్రితం తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది కొటియా గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించడానికి వెళ్తే ఒడిశా అధికారులు, పోలీసులు అడ్డగించారు. గంజాయిభద్రలో ఎపి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రం నిర్మిస్తే దాన్ని కొంతమంది కూల్చేశారు. ఇలాంటి దురాగతాలు, కవ్వింపు చర్యలకు ఒడిశా పాల్పడుతున్నా ఆంధ్రా అధికారులు మౌనం వహిస్తుండడం చర్చనీయాంశమైంది. ఒక దశలో ఒడిశా దూకుడుకు కళ్ళెం వేయాలనే ఉద్దేశంతో సారిక పంచాయతీ నేరళ్లవలసలో పోలీసు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని ఎపి అధికారులు భావించారు. ఆంధ్రా అధికారులు, ప్రజాప్రతినిధులు కొటియా గ్రామాల్లో పర్యటించినప్పుడు రక్షణ కల్పించేందుకు పోలీసు అవుట్ పోస్ట్ ఉపయోగపడుతుందని భావించినా అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. కొటియా గ్రామాలపై పట్టు బిగించడానికి అనుకున్నదే తడవుగా ఒడిశా ప్రభుత్వం రూ.150కోట్లతో ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసింది. కొటియాలో పోలీసు స్టేషన్, ఆసుపత్రి, అన్ని గ్రామాలకు రహదారులను నిర్మించింది. ఎపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్న కొటియా గ్రామాల గిరిజనులు ఇప్పటికీ ఇటువైపే మొగ్గు చూపుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టుచెన్నూరు, పగుల చెన్నూరు పంచాయతీల్లో డిప్యూటీ సిఎం రాజన్నదొర పర్యటించనున్నారు. వివాదాస్పదంగా ఉన్న గ్రామస్తుల సమస్యలపై రాజన్నదొర ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

అంబేద్కర్ ఆశయాలు యువతకు ఆదర్శం

ప్రజాశక్తి - సాలూరు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. మండలంలోని బోరబంద పంచాయతీ దేవుబుచ్చింపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో దళితులు, గిరిజనులకు కల్పించిన హక్కులు, ప్రయోజనాల వల్లే నేడు ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని చెప్పారు. ఆనాడు నిమ్నకులాల కష్టాలను, బాధలను కళ్లారా చూసిన అంబేద్కర్ రాజ్యాంగ రచన చేయడం వల్లనే మేలు జరిగిందని చెప్పారు. అలాంటి మహనీయుడు ఎల్లవేళలా ఆదర్శప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చింతగడ దాసు, రిపబ్లికన్ పార్టీ నాయకులు గొంప ప్రకాశరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి, ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, జసిఎస్ కన్వీనర్ కె.త్రినాధనాయుడు, వైసిపి నాయకులు సువ్వాడ భరత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాజన్నదొర



కొండతాడూరులో ప్రచార ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు

నిరంకుశ బిజెపిని సాగనంపాలి

ప్రచారభేరిలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పాచిపెంట

మతోన్మాదంతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న నిరంకుశ బిజెపిని రానున్న ఎన్నికల్లో సాగనంపాలని సిపిఎం నాయకులు సుర్రు రామారావు పిలుపునిచ్చారు. సిపిఎం ప్రచారభేరి లో భాగంగా మండలంలోని కొండతాడూరులో ప్రచారర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తంగలో తొక్కి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. వ్యవసాయ రంగాన్ని నాశనం చేసిందని, ఉద్యోగ భద్రత లేకుండా చేసిందని, కార్పొరేట్ల అభివృద్ధి ధ్యేయంగా అంబానీ ఆదానీలు లాభాలే తప్ప రైతులు, ప్రజలు, ఉద్యోగులు, గిరిజనులు సమస్యలు పట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపకపోతే భారతదేశానికి భవిష్యత్తు ఉండదని అన్నారు. ఇప్పటికైనా దేశానికి అన్నం పెట్టే రైతును ఆదుకోవాలని, కార్మిక కోడ్‌లను రద్దుచేసి పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ నియంతలంతా మట్టిలో కలిశారని, అయినా మోడీ ప్రభుత్వానికి జ్ఞానోదయం కలగలేదని అన్నారు. ఇటువంటి దుష్ట ప్రభుత్వాలకు పతనం కాక తప్పదన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళలు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

రజనీకాంత్‌ను విమర్శించే స్థాయి వైసిపికి లేదు

ప్రజాశక్తి - సాలూరు

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌ను విమర్శించే స్థాయి వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులకు లేదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి అన్నారు. ఆదివారం ఆమె తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగు సమాజం గర్వించదగ్గ మహానటుడు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన రజనీకాంత్ రాజకీయాల్లో, సినిమా రంగంలో ఎన్టీఆర్ సృష్టించిన సంచలనాల గురించి మాట్లాడారని చెప్పారు. అలాగే 40ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు విజన్ గురించి ప్రశంసించారని చెప్పారు. దేశం గర్వించదగ్గ మహానటుడు రజనీకాంత్ చంద్రబాబునాయుడు గొప్పతనం గురించి మాట్లాడితే వైసిపి నాయకులకు ఎందుకు అంత ఉలికిపాటని ప్రశ్నించారు. మాజీ ఎంపి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో ఎంపి అవినాష్‌రెడ్డి ఎప్పుడు అరెస్టు అవుతారో తెలియని అయోమయంలో ఆపార్టీ నాయకులు వున్నారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారిపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు నోటికొచ్చినట్టు ఇష్టానుసారం రజనీకాంత్‌పై విమర్శల దాడి చేయడం తగదన్నారు. మంత్రి రోజా, మాజీ మంత్రి కొడాలి నానికి రజనీకాంత్‌ను విమర్శించే అర్హత లేదని అన్నారు. విలేకరుల సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, పాచిపెంట, మక్కువ మండలాల అధ్యక్షులు ముఖి సూర్యనారాయణ, జి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఏకలవ్య ప్రవేశ పరీక్షకు 637 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఏకలవ్య పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్షలకు 703 దరఖాస్తులు రాగా , వీరిలో 637 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ పెంటారావు తెలిపారు. 66 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. 37 మంది విద్యార్థులు కొత్తగా పరీక్షలు రాసినట్లు ఆయన తెలిపారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

వంతెనను త్వరితగతిన పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సువర్ణముఖీనదిపై కొత్త వంతెన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఆదివారం సీతానగరం మండల పర్యటనలో భాగంగా ఆయన వంతెన పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల కలగా ఉన్న సీతానగరం కొత్త వంతెన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేసి, ఈ ప్రాంత ప్రజలు, అంతరాష్ట్ర ప్రయాణికుల కష్టాలను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. వందేళ్ల క్రితం బ్రిటీష్ వారి కాలంలో నిర్మించిన ఈ వంతెన నేడు శిథిలావస్థకు చేరుకుందని, ఎప్పుడు కూలి పోతుందోనని ప్రజలు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. 2019 ఎన్నికల ముందు హడావుడిగా శిలాఫలకం ఏర్పాటు చేసి, మరమ్మతుల పనుల ఖర్చు కోసం కేటాయించిన కోటి రూపాయలు నిధులు స్వాహా చేశారన్నారు. కొత్త వంతెన నిర్మాణానికి రూ. 19 కోట్లు కేటాయించారని, అయితే నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతూ ఎక్కడికక్కడే నిలిచిపోయాయని అన్నారు. ఏడు ఫిల్లర్లకు ఇంకా రెండు పిల్లర్లు పునాది స్థాయిలోనే ఉన్నాయన్నారు. ఎన్నో పథకాలకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని పాలకులు గొప్పలు చెబుతున్న పాలకులు రూ.20 కోట్ల ఖర్చుతో పూర్తి కావాల్సిన పనిని నాలుగేళ్లయినా, నేటికీ వంతెన నిర్మాణం పూర్తి చేయలేకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి సీతానగరం పంతెనను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.లక్ష్మునాయుడు, ఈశ్వరరావు, జి.వెంకటరమణ; ఆర్.రమణవ ూర్తి, సిహెచ్.కృష్ణమూర్తి, బి.అప్పారావు పాల్గొన్నారు.

తెలుగు కవితను శాసించిన మహాకవి శ్రీశ్రీ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

తెలుగు కవిత్వాన్ని కొత్తదారులు పట్టించి, భాషాభిమానులను దాసోహం చేసుకున్న కవి శ్రీశ్రీ అని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా స్నేహ కళా సాహితీ ఆధ్వర్యాన స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో నిర్వహించిన నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. 20వ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి, శ్రీశ్రీ గా ప్రసిద్ధి చెందారని. విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా ఆయన ప్రసిద్ధుడని వివరించారు. శ్రీశ్రీ హేతువాది అని, మహాకవిగా శ్రీశ్రీ విస్తృతామోదం పొందారని అన్నారు. మహాప్రస్థానం ఆయన రచించిన కావ్యాల్లో ప్రసిద్ధమైనదన్నారు. శ్రీశ్రీ చాలా చిన్న వయసులోనే తన రచనా వ్యాసంగాన్ని మొదలు పెట్టారని అన్నారు. తన 18 వ ఏట 1928 లో 'ప్రభవ' అనే కావ్య సంపుటిని ప్రచురించారన్నారు. ఈ రచనను సాంప్రదాయ పద్ధతిలోనే రాశారని, తరువాతి కాలంలో సాంప్రదాయికమైన గ్రాంధిక శైలి, ఛందస్సు వంటి వాటిని పక్కన పెట్టి వాడుక భాషలో మాత్రా ఛందస్సులో కవిత్వం రాయడం – ఇది గురజాడ అడుగుజాడ అని అన్నారు. 1950లో మహాప్రస్థానం కావ్యం మొదటిసారిగా ప్రచురితమైందని, మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, బాటసారి, భిక్షువర్షీయసి మొదలైన కవితల సంపుటి అది. ఆధునిక తెలుగు సాహిత్యం లో ఈ కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీ ని మహాకవి చేసిందని తెలిపారు. తరువాత మరోప్రస్థానం, ఖడ్గ సృష్టి అనే కవితా సంకలనాలను, చరమరాత్రి అనే కథల సంపుటిని, రేడియో నాటికలు రచించారని అన్నారు. పారినాయుడు మాస్టారు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో వేదాంత జూనియర్ కళాశాల వ్యవస్థాపకులు పెంట అప్పారావు, బివి ప్రసాదరావు వక్తులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో రచయితలు మళ్లీపురం జగదీష్, పక్కి రవీంద్రనాథ్, కె.నారాయణరావు (నాగు), గడగమ్మ రామకృష్ణతో పాటు సాహితీ అభిమానులు రచయితలు హాజరయ్యారు.



సభలో మాట్లాడుతున్న పెంట అప్పారావు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం

కార్మిక దీక్షదినం మేడే నేపథ్యంలో గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విఆర్‌ఎల సంఘం నాయకులు గురుమూర్తి కవాళి, అంగన్వాడీ కార్యకర్త సత్యవతి విప్లవ గీతాలకు నృత్యాలు, విశ్రాంత ఉపాధ్యాయుడు తిరుపతి నాయుడు గుఱ్ఱం జాషువా పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. శ్రీ శ్రీ జయంతి రోజు కావడంతో చిత్ర పటానికి పూలమాలలు వేసి మహా ప్రస్థానం లోని గీతాలను ఆలపించారు. చిన్నారుల పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్థానిక ఎన్‌జిఒ హోంలో జరిగిన కార్యక్రమంలో గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎల్‌ఐసి యునియన్ నాయకులు శ్రీనివాస్, ప్రజా సంఘాలు నాయకులు తమ్మినేని సూర్య నారాయణ, టివి రమణ, ఎ.జగన్మోహన్ , వి.రాములు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో విశాల ఉద్యమాలు : ప్రజా సంఘాలు



డాన్సు చేస్తున్న ప్రజాసంఘాలనాయకులు, కార్యకర్తలు



ప్రచారం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మేడేను జయప్రదం చేయండి

పార్వతీపురంటౌన్ : మేడేను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ పిలుపు నిచ్చారు. ఆదివారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే దినోత్సవాన్ని కార్మిక హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని అన్నారు. ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు అమలవుతున్న నేపథ్యంలో పోరాడి సాధించుకున్న హక్కులపై పాలకవర్గాలు దాడి చేస్తున్నాయని, వేతనాలు, ఉద్యోగాలు, భద్రత, సామాజిక భద్రత లేదని, శ్రమ చేసే వారంతా ఐక్యం కావాలని అన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులు నాగవంశం శంకర్రావు, నాగవంశం మల్లేష్, నాగవంశం నిర్మల, బంగారు రాజేష్, మామిడి శివ, మామిడి శివప్రసాద్, పవాల గాంధీ, చీపురుపల్లి సింహాచలం, పర్లినిండు పారిశుధ్య కార్మికులు నాగవంశం శివ, కార్మికులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఘనంగా వీడ్కోలు వేడుకలు


కురుపాం : మండల కేంద్రంలో గల సరస్వతి విద్యానికేత (అక్షర అకాడమీ) స్కూల్‌లో కరస్పాండెంట్ పి.సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పాఠశాలలో సెలవుల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఆటపాటలతో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నృత్యాలు చేశారు . ఈ సందర్భంగా కరస్పాడెంట్ మాట్లాడుతూ వందమంది వరకు అనాధ విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. 90శాతం మార్కులు దాటిన విద్యార్థులకు, కార్మికుల పిల్లలకు కూడా ఉచితంగా విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కోరుకొండ, నవోదయ పరీక్షలకు ర్యాంకులు సాధించడానికి కృషి చేస్తూ అందులో కూడా ర్యాంక్ సాధించిన వారికి ఉచితంగా 10వ తరగతి వరకు విద్య అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సర్పంచ్‌ను సన్మానిస్తున్న గడ్డికాలనీ వాసులు

సర్పంచ్ గౌరీశంకరరావుకు సన్మానం

గుమ్మలక్ష్మీపురం : స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావును గడ్డికాలనీ మహిళలు ఘనంగా సన్మానించారు. ఇటీవల కాలంలో గుమ్మలక్ష్మీపురం ఆరోగ్యవంతమైన పంచాయతీగా గుర్తింపు పొందిన సందర్భంగా సర్పంచ్ సేవలను గుర్తిస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు అప్పగించిన సర్పంచ్ పదవిని ఎంత బాధ్యతతో ప్రజల సహకారంతో నిర్వహించడం వల్ల ఆరోగ్యవంతమైన పంచాయతీగా తీర్చిదిద్దడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, వార్డు సభ్యులు వెంకట్రావు ఉన్నారు.



విజ్ఞాన మేళాలో మాట్లాడుతున్న హెచ్‌ఎం పైడపునాయుడు

పెదపెంకిలో విజ్ఞానమేళా

బలిజిపేట : మండలంలోని పెదపెంకి-2 పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సమక్షంలో రెడ్డి పైడపునాయుడు ఆధ్వర్యంలో విజ్ఞాన మేళా, పాఠశాల 5వ తరగతి పిల్లల వీడ్కోలు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ పెద్దలు అప్పలనాయుడు, కర్రి అప్పారావు, విశ్రాంత ఉపాధ్యాయులు, నేతాజీ గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవనాయుడు, పాఠశాల ప్రస్తుత విద్యా కమిటీ చైర్మన్ చీకటి గౌరీశ్వరి, మాజీ విద్యా కమిటీ చైర్మన్ వి.శివున్నాయుడు పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పిల్లల విజ్ఞానానికి సంబంధించిన ఎన్నో వస్తువులు తయారు చేసినవి పెద్దలు చూసి పిల్లలను, ప్రధానోపాధ్యాయులు పైడిపునాయుడును, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలు చేసిన నృత్యాలు అలరించాయి.



దయానిధిపురంలో ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు మోహనరావు

దయానిధిపురంలో 'మన సీతానగరం - మన జనసేన'

సీతానగరం: మన సీతానగరం-మన జనసేన కార్యక్రమంలో మండలంలోని దయానిధిపురంలో ఆదివారం జనసేన నాయకులు పర్యటించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం నియోజక వర్గ నాయకులు అక్కివరపు మోహన్‌రావు జనసేన సిద్ధాంతాలు, వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందని, రాబోయే రోజుల్లో జనసేనకు మద్దతిస్తామని ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం నియోజక వర్గ నాయకులు గంటేడ స్వామినాయుడు, హరిచరణ్ శంబాన, జై శంకర్, ప్రకాశ్, ప్రగడ కల్యాణ్, పాలూరు వెంకటేష్, దామోదర్, అల్లు రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెలవుల్లో పనులు అప్పగించడం సరికాదు

పార్వతీపురంటౌన్ : వేసవి సెలవులు వినియోగించుకోకుండా ఉపాధ్యాయులకు వివిధ రకాల పనులు అప్పగించడం సరికాదని ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు వెకేషన్ డిపార్ట్మెంట్‌గా పరిగణిస్తున్నారని, అటువంటప్పుడు వేసవి సెలవుల్లో పాఠశాల, విద్యార్థులకు సంబంధించిన వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించడం సరైంది కాదన్నారు. వాట్సప్ గ్రూపుల ద్వారా విద్యార్థులను పర్యవేక్షించడం ఆచరణలో సాధ్యం కాదని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో స్మార్ట్ ఫోన్స్ కలిగి ఉండే తల్లిదండ్రులు చాలా తక్కువని అన్నారు. అలాగే ఏజెన్సీలో నెట్ వర్క్ లేకపోవడం తదితర సమస్యలు ఉంటాయన్నారు. వీటిన్నంటిని పరిగణనలోకి తీసుకుని వేసవి సెలవుల్లో కార్యక్రమాలు విరమించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు సామల పేర్కొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి మహాసంప్రోక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రమైన సీతంపేటలో టిటిడి వారు కొత్తగా నిర్మించిన వెంకటేశ్వరస్వామివారి ఆలయ విగ్రహప్రతిష్ఠ, మహాసంప్రోక్షణ కార్యక్రమాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మే 4న మహాసంప్రోక్షణ, శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు, కార్యక్రమ ప్రధాన పర్యవేక్షకులు వేణుగోపాల దీక్షితులు మాట్లాడుతూ శ్రీవారి వైభవాన్ని నలుదిశలా వ్యాప్తి చేయడంలో భాగంగా దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో టిటిడి శ్రీవారి ఆలయాల నిర్మాణం చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా సీతంపేటలో అత్యద్భుతంగా స్వామివారి ఆలయ నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు. వెంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ, శ్రీ గోదాదేవి, గరుడాళ్వార్, ద్వారపాలకులు, విమాన గోపురం, ముఖమండపంతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పంచగవ్యప్రాసన, వాస్తు హోమం, అకల్మష ప్రాయశ్చిత్త హోమం, రక్షాబంధనం నిర్వహించామని తెలిపారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ, కుంభ స్థాపన, కుంభారాధన, విశేష హోమాలు నిర్వహిస్తారని చెప్పారు. కాగా, యాగాలలో 17 హోమ గుండాలతో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలకు ఉపద్రష్ట టిటిడి వైఖానస ఆగమ సలహాదారు మోహన రంగాచార్యులు, కంకణభట్టారగా శేషాచార్యులు వ్యవహరిస్తున్నారు. 25 మంది రుత్విక్కులు వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, ఇఇ సుధాకర్, ఎఇఇ రమేష్, డిప్యూటీ ఇఇలు ఆనందరావు, నాగరాజు, ఎఇఇ రవికుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

రాష్ట్రంలో జగనాసుర పాలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో జగనాసుర రక్త చరిత్ర పాలన కొనసాగుతుందని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి తోయక జగదీశ్వరి విమర్శించారు. గుమ్మలక్ష్మీపురంలోని ఆమె ఇంటి వద్ద ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వైసిపి పాలనలో ప్రజా సంక్షేమం పూర్తిగా కరువైందన్నారు. వివేక హత్య కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వివేక హత్య కేసు అవినాష్ రెడ్డికి, జగన్మోహన్‌రెడ్డికి మొత్తం తెలుసునని, చేయించిందంతా వారేనని, ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబుపై నేరాన్ని నెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసగించే పనిలో వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. గత నాలుగేళ్ల నుంచి డిఎస్‌సి జాడలేదన్నారు. దీంతో చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి లేక తీవ్ర నిరాశలో ఉన్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం యువత పట్ల నిర్లక్ష్యం చూపుతోందన్నారు. విశాఖ రుషికొండ ప్రాంతాన్ని వైసిపి నాయకులు తమ స్వలాభం కోసం పూర్తిగా నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తూనే ఉన్నారని అన్నారు. రైతు పక్షపాతినని చెప్పుకునే జగన్మోహన్‌రెడ్డి రైతుల ద్రోహి అన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేదని, రాష్ట్రంలో ఇసుక అక్రమాలకు వైసిపి నాయకులు పాల్పడుతున్నారని ఆరోపించారు. మరికొన్ని రోజుల్లో అవినాష్‌రెడ్డి బండారం బయట పడుతుందన్నారు. 2024 ఎన్నికల్లో రాక్షస పాలన పోయి టిడిపి గెలుపుతో రామరాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, నాయకులు అడ్డాకుల నరేష్ తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన గ్రామ దేవత ఉత్సవాలు



వీరఘట్టం : మండల కేంద్రంలో గల పైడితల్లి అమ్మవారి గ్రామ దేవత ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మే 10 వరకు జరగనున్నాయి. ఏడేళ్ల తర్వాత అమ్మవారు గ్రామ దేవత పండుగ నిర్వహించడంతో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తల ఎత్తకుండా ఉత్సవ కమిటీ భారీగా ఏర్పాట్లు చేస్తుంది. తొలిత ప్రముఖ యజ్ఞ కర్త ఎస్వీఎల్ శర్మయాజి ఆధ్వర్యంలో ప్రారంభించనున్నారు. మే 1న వనంలోని పైడితల్లి అమ్మవారిని ఊరేగింపుగా ఊరిలోనికి తీసుకువచ్చి బోయిడి ఇంట్లో కొలువు తీరుస్తారు. 3న అమ్మవారి ఘట్టాలు, పాలజంగిడి పురవీధుల్లో ఊరేగిస్తారు. 9న అంజలి రథం, సిరి మానోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఇప్పటికే అమ్మవారి ఆలయానికి సరికొత్త రంగులు దిద్ది ముస్తాబు చేశారు. మందిర ఆవరణ సమీప వీధులన్నీ విద్యుత్ దీపాలంకరణతో ఓ వెలుగు వెలిగి పోతున్నాయి. సుమారు తొమ్మిది రోజులపాటు జరిగి ఈ ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజలు అలంకరించేందుకు ఉత్సవ కమిటీ తెలిపింది.

ఉజ్జిడి బండి ఉత్సవం

పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉజ్జిడి బండి ఉత్సవం. జరిగింది. బోయుడు ఇంటి వద్ద ఉజ్జిడి బండికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఈ బండి పట్టణ వీధుల గుండా తరలిస్తారు. గ్రామస్తులు సద్దన్నం ఉల్లిపాయలను బండిలో వేసి మొక్కు కొన్నారు. అనంతరం రాజపురం రహదారిలో ఉజ్జుడి చెట్టు వద్దకు తరలిస్తారని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆదివాసీ జెఎసి మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మండల ఆదివాసి జెఎసి కమిటీని ఆదివారం మండలంలో గల పి.లేవిడి రబ్బరు తోట వద్ద మన్యం జిల్లా జెఎసి ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ రొబ్బ లోవరాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బిడ్డిక కడాయి, ప్రధాన కార్యదర్శిగా ఊలక నాగభూషణం, కార్యదర్శిగా తోట పట్టియ్య, ఉపాధ్యక్షులుగా జి.రామారావు, ఎ.గణపతి, కె.తిరుపతిరావు, వి.ముఖలింగం, సంయుక్త కార్యదర్శులుగా వి.ఆనందరావు, కె.కొండలరావు, బి.రాజయ్య, టి.కృష్ణ, బి.సుధాకర్, ట్రెజరర్ నిమ్మక మోహనరావు, అసిస్టెంట్ ట్రెజరీగా ఎ.అడ్డుమేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.పుష్పనాదం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కె.అప్పలస్వామి వి.ఆదినారాయణ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ కమిటీ ఏర్పాటు జిల్లా ఆదివాసి జెఎసి నాయకుల సూచన మేరకు జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకిల్ని గిరిజన జాబితాలో చేరిస్తూ శాసనసభలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించడం కోసం ప్రతి మండలంలో జెఎసి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. బోయ, వాల్మీకిల్ని గిరిజన జాబితాలో పూర్తిగా చేర్చినట్లయితే అసలైన ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధ్యాయ, రాజకీయ రిజర్వేషన్లు కోల్పోయే ప్రమాదం చాలా ఎక్కువగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసి జెఎసి జిల్లా నాయకులు నిమ్మక జయరాజు, రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హిమరక నీలకంఠం, నాయకులు పత్తిక లక్ష్మయ్య, తోయక నాగభూషణం, బి.అన్నాజీ రావు, ఐ.రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కొత్తగా ఎన్నికైన ఆదివాసీ జెఎసి మండల కమిటీ ఎన్నిక

టిడిపి నాయకుల అరెస్టులకు ఖండన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాజమండ్రిలో టిడిపి నాయకులను సిఐడి అధికారులు అక్రమంగా అరెస్టు చేయడానికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధిఉ ద్వారపురెడ్డి జగదీష్ ఖండించారు. ఆదివారం స్తానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బాబాయి హత్య కేసులో ముద్దాయి అయిన వైఎస్ అవినాష్ రెడ్డి అరెస్టుపై సాగుతున్న చర్చలపై దృష్టిని మళ్లించేందుకే రాజమండ్రిలో టిడిపి నాయకులను అక్రమంగా సిఐడి అరెస్టు చేసిందని విమర్శించారు. అవినీతిలో కూరుకుపోయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి నాయకులను అక్రమ అరెస్టులు చేసి ప్రజల్లో అవినీతిపరులుగా నిరూపించాలని చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే రాజమండ్రిలో ఆదిరెడ్డి అప్పారావు, వాసుల అరెస్టులని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లలోనూ టిడిపి నాయకులపై ఒక్క ఆరోపణను నిరూపించలేక ఆత్మనున్యతతో ఉన్న ముఖ్యమంత్రి త్వరలోనే ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సిన రోజు వస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, డి.మోహనరావు, నాయకులు జి.వెంకటనాయుడు, జాగాన రవికుమార్, బడే గౌరీ నాయుడు కోల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

3లోగా ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ, బెటర్మెంట్ పరీక్షలకు విద్యార్థులు మే3లోగా ఫీజులు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.శంకర్రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సప్లిమెంటరీ పరీక్ష రాసే వారు రూ.520 చెల్లించాలని, బెటర్‌మెంట్ రాసే విద్యార్థులు రూ.520 తో పాటు సబ్జెక్టుకు అదనంగా రూ.170 చెల్లించాలని ఆయన తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టులకు దరఖాస్తులను మే 1నుంచి 10వ తేదీ వరకూ ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ పి.రంగలక్ష్మి ఒక ప్రకటన తెలిపారు. వచ్చిన దరఖాస్తులు మే 15న స్క్రూట్నీ, 18న ఇంటర్వ్యూ, 19న నియామక ఉత్తర్వులు అందజేయబడతాయన్నారు. ప్రాజెక్టు పరిధిలో రాజుగాడిగూడ, మోగదారగూడ, గురండి ఆడాలి, ఈతమానుగూడ, మండ ఓంద్రుజోల, అడ్డాకులు గూడాలో పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

జనసేనలోకి డిసిసి జిల్లా అధ్యక్షులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఎపి ఆదివాసీ జెఎసి నాయకులు నిమ్మక సింహాచలం జనసేన పార్టీలో చేరారు. ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ జనసేన కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో జనసేన అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.



మెట్టవీధిలో జరుగుతున్న సిసి రోడ్డు పనులు

మెట్టవీధిలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - బలిజిపేట

మండల కేంద్రమైన బలిజిపేటలోని మెట్ట వీధిలో సుమారు రూ.15 లక్షలతో గ్రామ అభివృద్ధి పనులు చేపట్టినట్లు స్థానిక సర్పంచ్ బండారు రాగలత తెలిపారు. ఇంతవరకు 110 మీటర్లు దూరంలో సిసి రోడ్డును, 45 మీటర్లతో మరొక సిసి రోడ్డును, 45 మీటర్లతో ఇంకొక వీధిలో రెండో సిసి రోడ్డును, 30 మీటర్ల పొడవు గల సిసి రోడ్డు, 30 మీటర్లు పొడవు గల కాలువల నిర్మాణ పనులు జరిగినట్లు ఆమె తెలిపారు. పనులు ఇప్పటికే పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో జ్యోతిష్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ విక్రాంత్‌ను కలిసిన తూర్పుకాపు సామాజిక వర్గ సభ్యులు

కాపు సామాజిక భవన నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నిర్మించి తలపెట్టిన తూర్పు కాపు సామాజిక భవన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఆదివారం తూర్పు కాపు సామాజిక భవ నిర్మాణం కోసం తన స్వగృహంలో కలిసిన తూర్పు కాపు సంఘ నాయకులతో మాట్లాడారు. స్థల సేకరణ, భవన నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. అందుకు అవసరమైన నిధుల సేకరణ సామాజిక వర్గ పెద్దల సహకారం కార్యాచరణపై తరచూ సమావేశాలు నిర్వహించాలని సూచించారు, తాను అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు తూర్పు సంఘ నాయకులు కె.నారాయణరావు, కె.వెంకటరమణ, లోలుగు వెంకటరాజశేఖర్, సుదర్శన్, జగదీష్, కృష్ణారావు, పాలవలస దవళేశ్వరరావు, కనపాక చౌదరి నాయుడు తదితరులు ఉన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న సింహాచలం

6న రైతు అవగాహన సదస్సు

మక్కువ : రైతులకు కార్బన్ క్రెడిట్ ప్రోత్సాహకాలపై ఈనెల 6న జికెఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు టేకలోవలో జరుగుతుందని రీజనల్ కోఆర్డినేటర్ సింహాచలం తెలిపారు. ఈ సమావేశానికి జికెఎఫ్ అధినేత భాష ముఖ్యఅతిథిగా పాల్గొన్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణం మెరుగుపడేందుకు రైతుల కృషి ఎంతో ఉందన్నారు. గ్రీన్‌హౌస్ వాయువులు తగ్గించడం, వెలువడకుండా నిరోధించడం ఎంతో ఆవశ్యకత ఉందని అన్నారు. దీన్ని రైతుల ద్వారా మెరుగుపరచడం వంటి ప్రాధాన్యత అంశాలు చర్చించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా అర్హులైన రైతులను ఎంపిక చేస్తామని, కావున మండలంలోని రైతాంగం తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజలు ఆన్లైన్ మోసాలకు గురి కావద్దని ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు సూచించారు. ఇటీవల కాలంలో ప్రజలు ఎక్కువ శాతం ఆన్లైన్ మోసాలకు గురవుతున్నారని తెలిపారు. ఫోన్‌పే పాస్వర్డ్ లేదా ఆన్లైన్ పాస్వర్డ్‌ను చెబుతూ మోసపోతున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 1930 కాల్ సెంటర్‌ను పోలీస్ శాఖ ద్వారా ప్రారంభించారని తెలిపారు. ఖాతాదారుడు ఖాతాలో ఉన్న నగదును ఆన్లైన్లో మోసపోతే వెంటనే 1930కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. మోసపోయిన వ్యక్తి కాల్ పూర్తి వివరాలు అడిగి తెలుసుకొని అతని సెల్ ఫోన్‌కు ఒక పిడిఎఫ్‌ఫైల్ పంపించడం జరుగుతుందని చెప్పారు. ఆ పిడిఎఫ్ ఫైల్ ప్రింట్ తీసి మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి అకౌంట్స్‌ను బ్లాక్ చేయడం జరుగుతుందన్నారు. ఖాతాదారుడు ఏ ఖాతాలో నగదు మోసపోయారో వెంటనే తిరిగి నగదు పొందేందుకు 1930నెంబర్‌కు వేరే మొబైల్‌తో కూడా ఫోన్ చేసి మీ పూర్తి వివరాలు ఇవ్వొచ్చని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.సుధాకర్ తెలిపారు. కళాశాలలో ఇంటర్ తప్పిన విద్యార్థులు తప్పనిసరిగా ప్రత్యేక తరగతులకు హాజరై పరీక్షల్లో పాసవ్వాలని కోరారు.

దేవునిబంద కబ్జాదారులపై చర్యలు చేపట్టాలి

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని దేవునిబంద కబ్జాదారులపై అధికారులు చర్యలు చేపట్టాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో కబ్జాకు గురవుతున్న దేవునిబందను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని తూర్పు వీధి సమీపంలో మున్సిపల్ కార్యాలయానికి కూత వేటు దూరంలో సర్వే నెంబరు 343లోని 4.96 ఎకరాల విస్తీర్ణం కలిగిన దేవునిబందను దర్జాగా కబ్జాకు గురవుతుందన్నారు. జిల్లా ఏర్పడ్డాక పార్వతీపురం జిల్లాలో కబ్జాలు పెరిగాయన్నారు. ముఖ్యంగా పార్వతీపురం పట్టణంలో ప్రభుత్వ స్థలాలను, చెరువులను, బందలను, గెడ్డలను అధికంగా అక్రమార్కులు కబ్జా చేస్తున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు. తక్షణమే దేవుని బంధను రక్షించాలని, కబ్జాకు పాల్పడిన వారికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అనిల్ కుమార్, గొర్లి చంటి, దాలినాయుడు, రాంబాబు, నెయ్యగాపుల సురేష్, సిరిపురం గౌరీ శంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశరావునాయుడుకు నివాళి

భామిని : మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వలురౌతు ప్రకాశరావ ునాయుడుకు పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ నివాళ్లు అర్పించారు. ప్రకాశరావునాయుడు హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. మండలంలో పార్టీకి పూర్వ వైభవం తెచ్చే క్రమంలో ఆయన మరణం బాధాకరమని అని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గండి రామినాయుడు, తోట ముఖలింగం, రవి నాయుడు, మెడిబోయిన జగదీశ్వరరావు, భూపతి ఆనందరావు, సర్పంచ్ లోపింటి రాజేష్, కొల్ల మధు, భూపతి ప్రభాకర్, గురిబిల్లి లక్ష్మీపార్వతి ఉన్నారు.

సెలవుల్లోనూ చదువుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

వేసవి సెలవుల్లోనూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ.గౌరి అన్నారు. ఆదివారం విద్యార్థుల తల్లితండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఏం చేయాలో తెలియజేశారు. వి లవ్ రీడింగ్‌తో పాటు పాఠ్యాంశాలు చదవడం, చదివిన, చేసిన వాటిని ఒక పుస్తకంలో నమోదు చేయాలని తెలిపారు. విద్యార్థులకు ప్రగతి నమోదు పత్రాలు అందజేశారు. అనంతరం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ బృందంతో కలిసి 2023-24 విద్యా సంవత్సరానికి పిల్లల నమోదు కోసం, పాఠశాల పరిధిలోని దిబ్బగుడివలస, పుట్టూరు, నుక్కుడు వలస, సూడిగాం గ్రామాలు పర్యటించి తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరాలని కోరడంతో వారు సమ్మతించారు. కార్యక్రమంలో శశిధర్‌కుమార్, ఈశ్వరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పార్కులో పర్యాటకుల సందడి

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సెలవు దినంతో పాటు విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో పర్యాటకులు సందడి చేశారు. పర్యాటకులు కుటుంబాలతో తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. జల విహార వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నీటి మీద నడక నడుస్తూ వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర కొట్టారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేసి కేరింతలు కొట్టారు. ఆల్టన్ వెహికల్‌తో పార్కును చుట్టుముట్టారు. చిన్నారులు బుల్లి ట్రైన్ ఎక్కి సరదాగా ఆడుకున్నారు. కమెండో నెట్ ఎక్కి ఆడుకున్నాయి. జెయింట్ వీల్‌తో ఉయ్యాల ఊగారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

సీతానగరంలోని హనుమాన్ కూడలి దగ్గర రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం అప్పయ్యపేటకు చెందిన కండాపు జగన్నాథం (55) అనే మహిళ సొంత పనుల నిమిత్తం సీతానగరం వచ్చింది. ఈ క్రమంలో రహదారి దాటుతుండగా లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో ఆమెను జిల్లా ఆసుపత్రికి తరలించగా తీవ్ర రక్తస్రావం కారణంగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పాచిపెంట : మండలంలోని పి.కోనవలస ఘాట్‌రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఒడిస్సా నుంచి సాలూరు వైపు వస్తున్న టివిఎస్ మోపెడ్‌ను రొడ్డవలస మలుపు వద్ద ఒడిస్సా వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రామభద్రపురం మండలం కొట్టక్కికి చెందిన పోతురాజు చిన్నారావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సాలూరు సిహెచ్‌సికి తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.